క్లుప్తంగా

అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలి



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది

గుంతకల్లు రూరల్: అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీరంగ సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తిమ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు శనివారం శ్రీరంగ ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన



15వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 15, 16వ వార్డుల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లను పరిశీలించారు. ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్లు అంజల, నరేష్, వార్డు ఇన్‌చార్జ్‌లు వెల్డింగ్ రవూఫ్, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, ఏఈ సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో సహకార బ్యాంకులు



మాట్లాడుతున్న అబ్దుల్ జిలాన్

గుత్తి: ఇటీవల సహకార బ్యాంకులు అభివృద్ధి బాట పట్టాయని గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ అన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయంలో శనివారం 70వ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ జిలాన్ మాట్లాడుతూ అందరి భాగస్వామ్యం, కృషితో సహకార రంగాలు, బ్యాంకులు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. బ్యాంకు సీఈఓ మహేశ్వర ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాము, డైరెక్టర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గుత్తి: గుంటూరు జిల్లా రేపల్లిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన నేషనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. అండర్ –14లో లోకసాయి చరణ్ గోల్డ్ మెడల్, అండర్–12 లో మోక్షిత్, జితేంద్ర లు బ్రాంజ్ మెడల్ సాధించారు. శనివారం గుత్తి ఆర్‌ఎస్‌లోని ఎన్‌ఎస్‌పీఓ(నేషనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఆర్గనైజేషన్) లో జరిగిన కార్యక్రమంలో వారిని కోచ్ రంగ వినీత్, మేనేజర్ చిన్న రంగన్న అభినందించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఇసుక టిప్పర్లు

యాడికి: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇసుకను తాడిపత్రి మండలం పెన్నానది నుంచి యాడికి మండలం మీదుగా డోన్‌కు తరలిస్తున్నారనే సమాచారం రావటంతో ఎస్‌ఐ వేములపాడు క్రాస్ వద్ద దాడులు చేసి పట్టుకున్నారు.

తాడిపత్రి అర్బన్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. సెబ్ అధికారి విజయ్‌కుమార్ తన సిబ్బందితో బోగసముద్రం, గంగాదేవిపల్లి సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు లక్ష్మీనరసింహయ్య, మేకల శివప్రసాద్, దాసరి నాగార్జునను అరెస్టు చేసి కేసు నమోదు నిమిత్తం రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులకు అప్పగించారు.

సమస్యలు పరిష్కరించేందుకే 'గడప గడపకూ'



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: ప్రజా సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఓబుళాపురం, మైనాపురం, మైనాపురం తండా, కొంగనపల్లి, శంకరబండ గ్రామాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత మంజునాథ్‌రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు తెలియజేశారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే అధికారులు, పాలకుల చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు నేరుగా ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేరుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మాటలతో ప్రజలను మాయ చేసే ప్రభుత్వం మాది కాదని, చెప్పిన మాటకు, ఇచ్చిన హామీకి కట్టుబడి పనిచేసే జగనన్న ప్రభుత్వం అని ప్రజలకు తెలియజేశారు. ఓబుళాపురం, కొంగనపల్లి సర్పంచులు రమేష్‌రెడ్డి, లక్ష్మీదేవి, ఎంపీటీసీ హరి చక్రవర్తి, ఎంపీపీ బీవీ మాధవి, వైస్ ఎంపీపీ ప్రభావతి, జెడ్పీటీసీ కదిరప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ గోవిందునాయక్, ఎంపీడీఓ వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

గుడిపాడులో ఎంపీ రంగయ్య పర్యటన



గుడిపాడులో పర్యటిస్తున్న ఎంపీ రంగయ్య, పైలా నరసింహయ్య

యాడికి: గుడిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం అనంతపురం ఎంపీ తలారీ రంగయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పర్యటించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఎర్రగొల్ల శ్రీనివాసులు, ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె లావణ్య వివాహం గుత్తి మండలం తొండపాడులో ఆదివారం జరుగుతుండటంతో ముందస్తుగా వారు వధువు లావణ్య ను ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నేత వెంకటరామిరెడ్డి ఇంటివద్దకు చేరుకొని కార్యకర్తల యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ శ్రీనివాసులు, నాయకులు రమణ, శ్రీనివాసులు, రాజు, మదనయ్య, కృష్ణుడు, కొండయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



రక్త పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపైఆరా తీశారు. అనంతరం తాను స్వయంగా వివిధ పరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేశారన్నారు. ఇందులో భాగంగా నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉపాధ్యక్షుడు బాబయ్య, కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, రాబర్ట్, నాయకులు నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీలో అంతర్జాతీయస్థాయి పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఎల్‌క్వెంట్, వైబ్రంట్ స్పీకర్లు టోస్ట్ మాస్టర్స్ అంతర్జాతీయ పోటీలను నిర్వహించారు. కళాశాలలో మొదటి సారిగా హ్యూమరస్,ఎవాల్యుయేషన్ స్పీచ్‌పై పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపొందించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐటీ ప్రొఫెషనల్స్ వివిధ ప్రదేశాల నుంచి వచ్చారన్నారు. డిస్ట్రిక్ 126 రీజియన్ ఫైనాన్షియల్ మేనేజర్ డీటీఎం మణిదీప్, డివిజనల్ డైరెక్టర్ టీఎం శివరాజ్, ఏరియా డైరెక్టర్ జాన్‌పాషా షేక్ ఇతర డివిజన్ అధికారులు పోటీదారులను విశ్లేషించారన్నారు. టీఎం వహిదా ప్రధాన న్యాయ నిర్ణేతగా వ్యవహరించారన్నారు. టీఎం ఆస్మా, టీఎం ముస్కిన్, టీఎం మారియా, ఈఎస్‌సీ విజేతలు టీఎం నికత్ ఫాతిమా, టీఎం ముస్కిన్, టీఎం హర్ష హైదరాబాద్‌లోని డిస్ట్రిక్ 126 డివిజన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, క్లబ్ కన్వీనర్ వహిదా, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 15 మందికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. వినూత్న ఫర్టిలైజర్స్, హెటిరో ల్యాబొరేటరీస్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 15 మందికి ఉద్యోగాలు కల్పించారు. వీరికి కళాశాల సందర్శనకు విచ్చేసిన ఆర్‌జేడీ డాక్టర్ కె.నాగలింగారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా 9 మంది షార్ట్‌లిస్ట్‌లో ఉన్నారని, వారికి కూడా ఉద్యోగాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ వెల్లడించారు. జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, పుల్లయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్కేయూ వీసీకి సన్మానం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి పదవీ కాలం ఈ నెల 24న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆంటియా (ఆల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్), వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వీసీ దంపతులను శనివారం సన్మానించారు. మూడేళ్లలో వర్సిటీ పురోగతికి వీసీ విశేషంగా కృషి చేశారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఆంటియా ప్రెసిడెంట్ వెంకటప్ప రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఆంటియా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే. మురళీ రెడ్డి, పూర్వ సైన్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. శంకర్ నాయక్, జేఎస్‌టీయూ అనంతపురం బోధనేతర సంఘం అధ్యక్షుడు జయకృష్ణ, సెక్రటరీ పుష్పలత, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగా రెడ్డి, ఎస్కేయూ బోధనేతర సంఘం అధ్యక్షుడు ఎం. రాము, మాజీ ఉపాధ్యక్షుడు సి. నాగభూషణం సాకే గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తరిమెల పీహెచ్‌సీ వైద్యురాలిగా తేజశ్విణి



జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న డాక్టర్ తేజశ్విణి

శింగనమల: తరిమెల పీహెచ్‌సీ వైద్యురాలిగా డాక్టర్ తేజశ్విణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్. ఫిర్దోస్ ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో ఆమె స్థానంలో ఉన్నతాధికారులు డాక్టర్. తేజశ్విణిని నియమించినట్లు మండల వైద్యాధికారి శంకరనాయక్ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



షబానాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవడ్డూరు: నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని షబానా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రామాంజనమ్మ తెలిపారు. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన అండర్–17 జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో షబానా అత్యంత ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాలలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో షబానాను పీడీ, హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ సీఎం గంగయ్య

పెద్దవడుగూరు: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీ సీఎం గంగయ్య సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి సిబ్బందితో ఫ్యాక్షన్ గ్రామాల్లోని పరిస్థితులపై చర్చించారు. ఫ్యాక్షన్ గ్రామాల్లోని రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. యాడికి సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు ఉన్నారు.

కులగణన సర్వేకు సహకరించండి

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న కులగణన సర్వేకు సంచారజాతులు సహకరించాలని ఏపీ సంచారజాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు కోరారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ సంచారజాతుల వారు తప్పనిసరిగా తమ కులాన్ని నమోదు చేయించుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయప్ప, మహిళా సంఘం అధ్యక్షురాలు ఇందిరాలతో పాటు వంశరాజ్, మొండిబండ, తోలుబొమ్మలాట, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నందీశ్వరుడి గ్రామోత్సవం





గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి (ఇన్‌సెట్‌లో) ఊరేగింపుగా వస్తున్న నందీశ్వరుడు

తాడిపత్రి అర్బన్: బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ముందు నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నందీశ్వరుని గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నందీశ్వరుని విగ్రహానికి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే జెండా ఊపి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామోత్సవం యల్లనూరు రోడ్డు సర్కిల్ మీదుగా పోలీస్‌స్టేషన్ సర్కిల్,నవరంగ్ టాకీస్ రోడ్డు మీదుగా బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంది. అక్కడ నందీశ్వరుని విగ్రహానికి స్వాగతం పలికిన అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ తలారి రంగయ్య పూజల్లో పాల్గొన్ని నందీశ్వరుని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య, కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాల చైర్మన్లు పోలిశెట్టి ఆంజనేయులు, వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దాతలు అందించిన రూ.6 లక్షలతో 11 అడుగుల పొడవు, 7 అడుగుల ఎత్తు, నాలుగున్నర అడుగుల వెడల్పుతో ఆళ్లగడ్డలో విగ్రహం తయారు చేశారు. ఆదివారం ఉదయం 9.45 నిమిషాలకు ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్



ఆర్బీకే శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మొలకలపెంట గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, యువ నాయకుడు మంజునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనసాగు నుంచి పంటచేతి కొచ్చేదాకా రైతులు ఇబ్బందులు పడతారన్నారు. అన్నదాతల కష్టాలను చూసి చలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు పంపిణీతోపాటు, పండిన పంటకు గిట్టుబాటుధర అందించి కొనుగోలు చేస్తున్న ఆర్బీకేలు రైతన్నల కష్టాలను పూర్తిగా దూరం చేశాయన్నారు. రైతన్నలు ఆర్బీకేలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటసాగు చేసే ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని అప్పుడే ప్రభుత్వం అందించే పథకాలకు రైతులు అర్హులవుతారని తెలియజేశారు. గుంతకల్లు మండలాన్ని ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జగనన్న పాలనలో రానున్నవన్నీ రైతన్నలకు మంచి రోజులేనని కావున అన్నదాతలు అందరూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ మురహరినాయుడు, ఎంపీటీసీ నాగప్ప, ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, వైస్ ఎంపీపీ ప్రభావతి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఏఓ స్వాతి, మండల ఇంజనీర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి నేడు భూమిపూజ

పామిడి: పట్టణంలో ఆదివారం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి భూమిపూజ చేయనున్నారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

వేతనాలు చెల్లించాలి

తాడిపత్రిటౌన్: వేతనాలు చెల్లించాలని గన్నెవారిపల్లి కాలనీ పంచాయతీ కార్మికులు కోరారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, హనుమంతరెడ్డి, కార్మికులు రాజు, రామకృష్ణ, కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గార్లదిన్నె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన దృశ్యం



తాడిపత్రిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

యాడికి: ప్రతి ఒక్కరూ గ్రంథాయాలని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మధుసూదన్ కోరారు.గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని నం:3 ప్రాథమిక పాఠశాల, ప్యారడైజ్ పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల చివరి రోజున బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి మధుసూదన్ తెలిపారు. నం:3 పాఠశాల హెచ్‌ఎం సుశీలభాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని కెప్టెన్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి రామాంజనేయులు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందిస్తామని ఆయన తెలిపారు. హెచ్‌ఎం పీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థులకు శనివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు త్వరలో బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి శిరీష తెలిపారు.

తాడిపత్రి అర్బన్: విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీ తత్వం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి రవికుమార్‌నాయుడు పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు ఈనెల 20న బహుమతులను అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు. పాఠశాలహెచ్‌ఎం రంగయ్య, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పామిడి: స్థానిక టీసీ హైస్కూల్‌లో శనివారం గ్రంథాలయాధికారి సీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు, క్విజ్, చిత్రలేఖనం పోటీలు జరిపారు. పోటీల్లో స్థానిక టీసీ హైస్కూల్, జెడ్పీహెచ్‌ఎస్, మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముచ్చుకోట జలాశయానికి జలకళ



ముచ్చుకోట జలాశయంలోకి చేరిన నీరు

పెద్దపప్పూరు: ముచ్చుకోట జలాశయం జలకళను సంతరించుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ముచ్చటగా మూడో ఏడాది ముచ్చుకోట జలాశయానికి నీరు చేరడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2019లో ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తాను స్వయంగా మాట్లాడి ముచ్చుకోట జలాశయానికి నీరు తప్పక విడుదల చేయిస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు 2021లో ముచ్చుకోట జలాశయానికి నీరు వచ్చే కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో సొంత డబ్బుతో కాలవ పూడికతీత పనులను చేయించి నీరు విడుదల చేయించారు. అన్నమాటకు కట్టుబడి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో ఎమ్మెల్యే, వైస్సార్ ప్రభుత్వంపై పరిసర గ్రామాల రైతులకు గట్టినమ్మకం ఏర్పడింది. ఒకప్పుడు ముచ్చుకోట జలాశయానికి నీళ్ల వదలాలని అప్పట్లో జేసీ సోదరులను రైతులు ఎన్నిసార్లు వేడుకున్నా వారి గోడు పట్టించుకోలేదు. కారణం జలాశయానికి సమీపంలో ఉప్ప తమ క్వారీల్లోకి నీరు వచ్చి చేరితే తమ ఆదాయానికి గండి పడుతుందని భావించేవారు. ఎన్నికల సమయంలో నీరు తప్పక విడుదల చేయిస్తామని కల్లబొల్లిమాటలు చెప్పి పదవులు పొందారు. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి నీరు చేరడంతో పరిసర గ్రామాలైన వరదాయపల్లి, చిక్కేపల్లి, అమ్మలదిన్నె, కొత్తపల్లి, నామనాంకపల్లి, ముచ్చుకోట గ్రామాల్లోని బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగాయని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.